అమృత్‌కిరణ్ కథలపోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ (250/-)

# నిప్పు చెదపడుతూంది.

-చావా శివకోటి

సీతాలు చింతపిక్కలాగుంటది చూసేటందుకు.

అంత కుదమట్టంగా ఎందుకుందో - ఆ దేము డయ్యకే తెలియాల!

నడకలో ఎంత నాజూకుతనం ఉన్నా, గిన్నెకాయ, ఒగరూ కనపడతది.

ఊరి చెరువున నీళ్ళోసుకొని వచ్చేటప్పుడు కూడా, కడిగిన ముత్తెంలా అనిపించదు.

గొరదనపు మెరుపు తప్పు!

కాకరకాయ చేదుదనం

గోగ్గూర పులుపు దనం

చెరుకు గడ తీపిదనం

ఉసిరికాయ కమ్మదనం

పాల మీగడ వెగటుదనం.

కలగాపులగమై- అలవోకగా - అదోలా అనిపిస్తది.

చాటడంత కేరింత - గిలిగింతంత మైమరుపు- వయస్సు ఎగదట్టిన నిగారింపు కలబోసినట్టుగా అనిపించి - గుండెలోతును తడిమి - గుబుళనిపిస్తది.

ఒకసారి-

ఓట్లకోసం వచ్చిన అసామి- గుడిసెలెంట తిరుగుతూ - సీతాలు కంటబడగానే ఆగి- 'అమ్మో ఇది ఓటరయినట్టుంద'నుకొని- చొంగకారబోతుంటే కండువాతో తుడుచుకొని 'ఇగో పోరీ నీ ఓటునాకే వెయ్యాల!' అనడిగిండు.

ఆడిమాట వినపడగనే - అదోలాగయి- బోలెడుసిగ్గు పడింది సీతాలు.

అదేదో అడగరానిది అడిగినట్టు. 'ఓటెవనికేసినా '- ఏటనీటిలో ఏసి నట్టే' అనిపించి - కళ్ళెర్ర బడినాయి.

ఈ నాల్గు దినాలు, వరాలిచ్చే దేముళ్ళలా అరచేత వైకుంఠాన్ని పెట్టుకుని తిరుగాతరు ఎదవలు. 'ఉట్టి' కూడా అందుబాటులో కనపడని జనానికి స్వర్గంలోకి పంపెడి గుమ్మంలా కనపడతారు.

ఇది మూణ్ణాళ్ల ముచ్చటనీ- ముప్పొద్దుల భాగోతమనీ తెలిసేసరికి- కాలం చెల్లిపోతది- ఆడు సీటెక్కి- తిరిగి చూడకుండాపోతడు.

'ఏందిరా ఇదీ?' అనుకుంటుండగనే- మళ్ళీ ఎన్నికలు.

కొత్త మడుసులు - కొత్త ఏసాలు. కొత్త మాటలు, కొత్త ఊసులు వీటితో పాటు మూటలు.

అదే పాతోడయితే, సారాపీపాలు, ఏటలు. నల్ల జీవాలు. కొత్తవరాలు.

ఇక్కడ 'మట్టి'నంటి పెట్టుకొని బతుకీడుస్తున్న మనిషికి దోవ చూపడం కాదిది. అసలాళ్ళ ఊసుకలిక్కానికి కనపడదు.

ఏన్నికల ముందు - ఒకడొచ్చిండట. మా అవ్వ చెపుతుండెడిది. చూసేటందుకు సుబ్బరంగా ఉన్నాడట.

అది చూసి 'పోరడుబాగున్నడు. వయసోడు తిరగుతడు. మనని అరుసుకుంటడు అనుకొని అప్పనంగా గెలిపించినారట.

వాడు కోటాలో వాడయి పోయి గబుక్కున మంత్రి అయిండట.

ఇది విన్న జనం ఊళ్ళో పెండ్లికి కుక్కల హడావిడి అన్నట్లుగా- ఇరగబడిపోయి పిలుచుకొచ్చి సన్మానాలూగట్రా, ఘనంగా చేసినారంట.

దాంతో ఉబ్బి తబ్బిబ్బయిపోయి 'అదిజేస్త - ఇది జేస్త చిల్లాకుతూటుగా పొడిచి పారేస్త' అని చెప్పినాడంట.

పూలరథాలపైన ఊరేగుతూ ఏటల్నితింటూ- నీడపట్టున- ఉన్నప్పుడు ఇంకా - ఎన్నెన్నో చెప్పి- చానా మురిపించినాడంట.

ఇదిట్ట నడుస్తుండగానే.

పైన ఏం తిరకాసు జరిగిందో?

ఎవడికి ఏడ వాటాలలో తేడా వచ్చిందో?

మళ్ళీ ఎన్నికలు వచ్చినయి.

ఈ మాట తెలవంగనే- నడి సన్మానం నుంచి పరుగున దిగివచ్చి కారెక్కి పట్నం వెళ్ళిపోయిండంట.

వాడే మళ్ళీ ఎన్నికలలో టిక్కెట్టు తెచ్చుకొని వచ్చిండట.

అయితే ఈ తడవ వచ్చిన టిక్కెట్టు పట్నానికి కాదు, ఢిల్లీకి.

'మొన్న పాపం- పోరడికి - ఏం చేద్దామన్నా తీరి చావలేదు- ఈసారికి వేసి చూద్దాం.' అనుకొని గెలిపించినారంట!

ఎప్పుడూ కోటాలో వాడేగద. ఆడావడికో మంత్రి పదవి వచ్చింది. తంతె గారెలగంపలో పడ్డట్టు.

అయితే ఈసారి ఈ పోరడు - నిండా అయిదేండ్లూ బెసక కుండా- ఉన్నడు.

ఓ ఏడాదిపాటు ఊళ్ళెంట తెగతిరిగిండు పాపం!

అందరినీ - అరుసుకున్నడు. ఆనక మళ్ళీ కనపడలేదు.

'ఇమానంల వచ్చేటందుకు కూడా తీరి చావలేదు పాపం.

తనని నమ్ముకున్న జనానికి ఏదో చేయాలని మాలావు ఇదయి పోయిండట.

అసలీ పేదోళ్ళేంది? ఎందుకున్నారు? ఈ పేదరికం పూర్తిగా ఎట్టా తీసెయ్యాల? వాళ్ళ ముఖాన- మొలకనవ్వు ఎట్టా నిలుస్తది?

అనే దాన్ని పూరాగా ఆరాతీసి- పరిష్కారం కనుక్కునేందుకు దునియా అంతా- వదలకుండా ఊపిరాడకుండా తిరిగిండంట.

ఈడు ఎంత తిరిగినా లైను దొరకలేదు. అది వాడి తప్పు కాదుగద. అయితే పట్నంల - ఢిల్లీల - మాంచి బంగ్లాలు కొనుక్కున్న డనీ. బెంగ్లూరు దిక్కున పదెకరాలు. పోక చెక్కతోట అమర్చుకున్నడనీ- ఏలూరుతాన వందెకరం మామిడి తోట కొన్నడనీ- భద్రాచలం దోవన ఇన్నూరు ఎకరాల జీడి మామిడి ఏయించిండనీ- మద్రాసుల సినిమా హాలు కొన్నడనీ వీటిని ఏర్పాటు చేసుకునేందుకే- ఊపిరాడకుండా తిప్పలు పడ్డాడనీ- గిట్టనోళ్ళు చెప్పారు.

ఇది అడుగుతామనో, అయిదోఏడు చివరదనక కనపడలే.

ఎన్నికలు వచ్చినయ్ మళ్ళా. పైన ఏం తిప్పలు పడ్డడో టిక్కెట్టు తెచ్చుకున్నాడు మళ్ళా. ఇన్ని అమరినాక టిక్కెట్టు రాకపోతే పోతదా?

ఈ దేశంల - ఏ పార్టీ అయిన పిలిచి- ఇచ్చేట్టు కనపడ్డది తనకి.


అదేం చోద్యమోగానీ, వాడు రాంగనే. మళ్ళీ తిరణాల మొదలయింది.

'జై జేలు' చెప్పిను. ఏటలూ - తోటలూ పెట్టి నారు. ఊరేగించినారు. ఇంతమంచోడు. జనంకోసం ఒళ్ళు దాచుకోకుండా పనిజేసేటోడు ఇప్పటికి పుట్ట లేదని భుజాన ఏసుకున్నారు.

చాలాసేపు ఈ తంతేందో సమజ్ గాలేదు.

ఆనక - తెల్సింది.

వాడీతడవ- ఎనకటిమాదిరి- ఊరికే ఓట్లడిగేటం



దుకురాలే.

పైగా- అందర్నీ కూకోన బెట్టి. 'ఇగో! కాలం చూడబోతే గడ్డుగ ఉన్నది. మరీసారి ఊర్నే నాకు ఓటెయొద్దు. మీకేం గావాల్నో బేఫికరుగ అడగండి. తీసుకోండి. అనక ఓటెయండి. మీ ఋణం నాకొద్దు' అని.

అంతటితో ఊర్కోలేదు బిడ్డడు. సారా ట్యాంకులు పంపిండు. పట్నంనుంచి ఏటల్ని పంపిండు. నోట్లు ఇచ్చిండు. అడగనోడిది పాపం అన్నట్టుగ ఉన్నడు.

'పోరడు ఎంత మంచిగ ఎదిగిండు' అని ముక్కున ఏలేసుకున్నరు జనం.

వాడి ఋణం ఉంచుకోలేరు. మళ్ళీ గెలిపించినారు.

ఆ తరువాత ఒక్కోడికి 'ఏందిర ఇది' అని పించింది.

వీడు- పదేళ్ళకింద- బడ్డీబళ్ళవెంట - నిలబడి- అప్పనంగ ఇడ్డీన్లు తిన్నోడు గగా! నరంలేని చేయి లెక్క- పైసల్ని విసిరేసిండు?

రెండువేల ఎకరాలున్న పెద్దొర సురేంద్రరెడ్డి గార్కి సీలింగల సెంటు పోకపోయే నలభై ఎకరాలన్న నాయుడుది పదెకరాలుపోయే.

మాయగాక మరేంది?

'దేశం అప్పులపాలయింది. ఆగమయింది. కష్టపడాలి. దేశభక్తి పెంచుకోవాలి.' అని చెవితెగిన మేకల్లా అరిసిన ఈళ్ళందరూ ఈ మధ్యన కోటీశ్వరులు అయ్యారని జనానికి తెలుసు. ఈ దేశానికి తెచ్చిన అప్పు మొత్తం మళ్ళీ తాననే ఉందని తెల్సు. చౌరస్తాలో పబ్లిక్‌గా అబద్దాలాడుతున్నారని తెల్సు.

అయినా... ఒక్కడూ అడగడేం! పెదవి కదప డేం!

ఇట్ట నడుస్తుంది మన సొరాజ్యం! అని సీతా లుకు బాగా తెల్సు. గనుక సిగ్గుతో చితికి పోయింది. 'నీ ఓటు నాకేనన్న మాట' అనుకుంటూ ఏ..షారుగా నడిచిండాడు.

★ ★ ★

సీతాలుకు వయసొచ్చింది. పైట సరింగ నిలవడం లేదు. దాన్ని పైకి జరిపినప్పుడల్లా కొత్తగా- ఏదోలా అనిపించసాగింది.

వయసు కాడెవడు కనపడ్డా సిగ్గనిపిస్తూంది. ఆ రోజులలోనే - సీతాలుకు మనువూ వచ్చింది.

పోరడు పదిదనక చదివిండట.

చూసేటందుకు శుబ్బరంగానే ఉన్నడు.

పైగ- కట్నం నాకు అక్కర్లేదన్నడు- ఇది విని సంబరపడిపోయినారు- అంతా.

అయితే - తీరా లగ్గంనాడు- చిన్నమెలిక పెట్టిండు.

'కట్నం గిట్టవద్దంటిని గద. చిన్నదో చితకదో- గవర్నమెంటు కొలువిప్పియ్యండి!' అని. పక్కలో పాముపడ్డట్టు ఉలిక్కిపడ్డడు జనం.

అటెండరనే సరికి- మంత్రులు- పోటీపడేటంత- ఇదేటి? అని నోరెళ్ళ బెట్టినారు. ఇంతలో- మనకి 'కుర్దుగ ఈడగెలిచిన మంత్రి ఉన్నడు గదా! 'అడిగి చూద్దం' అనుకున్నది.

అవును- కాదు అని తేల్చి చెప్పక- పట్నం చేరినారు.

పొద్దుపొడిచినేళ నుంచి మంత్రి దగ్గర ప్రాణా చరంపడి గడ్డపార ముహూర్తపేళ్ళ - మంత్రిని కలిసి నారు- దండమెట్టి అడిగినాడు.

చల్లకొచ్చి ముంతదాస్తే ఎట్ల!

'నౌకరి' మాట ఇనంగనే - మంత్రి నిండుగనవ్వింది- దీనెమ్మ సిగదరగ నిండాగ మతి పోయింది. ఉద్యోగం ఒళ్ళో పడ్డట్టుగనే అనిపించింది.

అయితే ఈ ఆనందం దిగిపోకముందే - మంత్రి పాడగాటి సిగరెట్టు బైటకు తీసి సుతారంగ నోట్లో పెట్టుకొని లైటరుతో అంటించి - పొగ బైటకు రింగులుగా ఊది నింపాదిగ ఓ మాట చెప్పిండు. తమ్మీ! మనది పేద దేశం! ఏడ జూచినా ఆకలే గందుకే మగాడైతే లంచం. ఆడదైతే మానం. అప్పుజప్పుందే ఏ పనీగాదు' అన్నడు నవ్వు చెదరకుండా.

'ఆశ'గ- వాడికి కల్సుకున్నోడికి మాత్రం దుఃఖం ఆగలెదు.

ఆసలు అంత నిబ్బరంగా చెప్పిన ఈ మాట మాకు అర్థమే కాలేదు.

ఇంతలో మంత్రిగారి కోసం ఓ సంసారి వచ్చింది. దానెంట తాళి కట్టిన మొగుడు కూడా ఉన్నడు. పెంపుడు కుక్కలెక్కన. మనోళ్ళకు గూడ, తెల్సిన పోరే-

పక్కనగుత్తేదారూ వాళ్ళెంటనె లోనదూరిండు.

కూసేపయినక- ఆ పోరి పెనిమిటి ఏదో పని మునిగిపోయ్నట్టు బయటకొచ్చి తిరిగి లోనకు పోతే... ఆ పోరి కూడా బయటకొస్తదేమో పలకరించి పోదం అని మనోళ్ళుపాపం - చానాసేపు చూసినారు. కానీ ఎంతకీ రాలేదు.

'కలికాలం' అనుకుంటూ బయలు దేరినారు.

ఇంతలో గడపతాన- పెద్దసారాయి గుత్తేదారు.... ఎదురుపడినాడు. కన్ను చెదిరిపోయే ఖద్దరుంది - వాని వంటి మధ్యన వాని చెప్పులూ వాచీకి కట్టిన బెల్టూ- తెల్లంగ మెరిసిపోతన్నయి.

మెడన మొల తాడు లాంటి బంగారం గొలుసు రెండు చేతులకూ మూడు ఉంగరాలు. తారు నలుపు రంగులో - ఫ్రెంచ్ కటింగ్ మీసంతో- మాలావు జబర్దస్తుగ నడిచి వస్తున్నడుపో!

వాని ఎన్నుగాచుకొని- ఇద్దరు చెమ్చాగాళ్ళున్నారు. వాళ్ళు పొందూడ ఖద్దరే ఏసినారు.

'ఓరి నాయనోయ్! గాంధీగారు వడకమన్న ఖద్దరుకేంగతి పట్టిందిరోయ్' అనుకుంటూ... అటే చూశారు.

ఈ 'సారా' యాపారం ఏందోగానీ దీనెమ్మసిగదరగ- ఇది చేసిన ప్రతోడూ- బంగ్లలు కొన్నాడు- ఎస్టేట్లు కొన్నారు. సినీమాహాళ్ళు కొన్నరు. సినిమాలు తీసినారు! పాడుగు కార్లనుంచి దిగరు. గవర్నమెంటుకు పైకం కడతనే ఉంటరు. ఇక- తాగేటోడు! ఉన్నదీ- ఉంచుకున్నదో పోగుట్టుకొని- రోగాలతో రొష్టులతో ఆసుపత్రిపాలవుతరు. అర్ధాంతరంగ కాట్లోకనపిస్తరు.

బ్రాకెట్టు ఆటా అంతే! దీన్ని ఆడెటోడి అడ్రసు అందరు. ఆడిపించెటోడు మాత్రం- అందకుండా ఎదిగి పోతడు.

'అమ్మో! అమ్మో!' చెప్పుకోవడమెందుకు గానీ- చానా చానా చిత్రాలు కనపడతాయి. కానీ ఒక 'పళాన' అంతుపట్టవు.

'పూరా' ఎవనికైన అంతా పడితేమాత్రం మంచినీళ్ళు అడగకుండా- 'హరీ' మంటడు.

అందుకేనేమో చానామంది పెద్దాళ్ళు అసలు దీని పట్టించుకోరు. అయినా - 'ఏందోసాద' అనుకొని- మనోళ్ళు- మంత్రి కొంపనుంచి వచ్చేసినారు.

ఇంటికొచ్చి సంగతి చెప్పినాక ఆ 'మంచిపోరడు' సీతాల్ని మనువాడనన్నడు. పెండ్లి తంతు సగం నడచినంక- 'అదీ ఆడపోరిది' లగ్గ మాగిపోతే- ఊళ్ళలో- మరీ 'బేకారు' గ ఉంటదిగదా!

అంచేత- 'సీతాలు' ఎంత చింతపిక్కలాగ ఉన్నా- దాని పని అంతే అయి కూర్చుంది. అయినా ఈ మగపోరళ్ళ సంగతి బొత్తిన అంతుపట్టదు.

'మంచిపోరి' కనిపిస్తేచాలు- ఎంటబడతరు- ఎంతయిన ఇచ్చి కలుస్తరు మాన్యాలు మంటగల్పుతరు.

అదే 'మంచిపోరి ఉంది పెళ్ళాడరా'! అంటే మాత్రం- కట్నం కావాలంటరు. 'మొలతాడు లేనోడికి ఏభైవేలిస్తిరి నాకు ఇబ్బడి అయినా ఇయ్యరా" అని ములగ చెట్టెక్కుతరు.

ఇట్టగుంది. నడుస్తున్న కాలం.

అందుకే పట్టుదలగ- చెప్పులు అరిగిందనక తెగతిరిగి- ఓ 'పోరణ్ణి' పట్టుకున్నారు మనోళ్ళు.

వారికి మున్సిపాలిటీ మురికి కాల్వలకు సాపు చేసే నౌకరీ ఉంది!

దానికే వాడు నలభైవేలు నగదు అడిగినాడు. ముప్పయికి సరిచేసి లగ్నపత్రిక రాసుకొని సీతాలుకు లగ్గం చేసి చేతులు దులుపుకున్నారు.

మగడివెంట కాపురానికి తోలారు సీతాల్ని. బరువు దిగిందని సంతోషపడ్డారు.

పెళ్ళి చేసినారు గదా! అయితే గోడకు వేసిన సున్నం మాయకముందే- సీతాలు గోడకు విసరిన బంతిలాగా రారమ్మన్నారు.

'ఏంది బిడ్డా!' అంతా అమ్మలక్కలు గుంపుగూడి.

'అత్తగారితో పోకడ చెప్పక తప్పదాయె సీతాలుకు.

పెనిమిటి పగలనక- రాత్రనక తాగుతాడట! వాడి కొచ్చెడి జీతం- వానితాగుడికే బొటాబొటీగా సరిపోతాయట! అంతదనక బాగనే ఉంది. ఈ దినాలలో ఎన్ని నిషేధాలు పెట్టినా తాగేటోడు ఏడా ఆగుతన్నాడు గనుక! ఉన్ని - బయటకెళ్ళి సంపాదించ మంటన్నడట!

కూలికోనాలికోపోతే వాడి పరువు డ్యామేజవుతుందట.

మరెట్ట? అంటే? గుట్టుగ మందితో పోయి- సంసార మెల్ల దీయమంటడట!

అదేంపాపమో! గందుకే సీతాలు చెప్పకుండా తోవన పడివచ్చింది.

'అరె బిడ్డా! ఇదెక్కడి పాపం! తాళిగట్టినోడిట్ట అనొచ్చునా? లోకంల ఎక్కడైన ఉందా? పంచాయితి పెట్టి గడ్డిపెడతం' అని మనోళ్ళు ఆడికి నడిస్తిరి.

'ఎండకాలం పొద్దుగద' నడినెత్తి కొచ్చిందనక నడచి- బాట దాపునున్న మోటబాయి చెట్టుకడ- చతికిలబడి-

## పరిచయం

పేరు : చావా శివకోటి

పుట్టిన తేది : నవంబర్ 11, 1940

జన్మస్థలం : ఖమ్మం జిల్లా - గోకినేపల్లి గ్రామం.

విద్యార్హతలు: ఖమ్మం కాలేజీలో బి.ఏ.

1965 నుంచి వ్రాస్తున్నాను.


ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, మయూరి, పల్లకి, ఆంధ్రభూమి, ఉదయం లలో సీరియల్స్ వ్రాశాను.

దాదాపు వంద కథలూ, అంవై చిన్న కథలూ,వివిధ పత్రికలలో వీరీవీరీ గుమ్మడిపండు, పురాణ రాజకీయం, ఈ కథ ఇంతే శీర్షికలు నిర్వహించాను.

రాజకీయ వ్యాసాలూ, పురాణ దేవాలయాలపై వ్యాసాలూ, చారిత్రక వ్యాసాలూ వివిధ డైలీలలో ప్రచురించబడ్డాయి.

శ్రీమతి ఉమాభాస్కర్‌భీమా, దిఎన్ఎస్ఎఫ్‌సి స్టోర్, ఎల్.పి.జి.వింగ్,శక్కర్‌నగర్, బోధన్.

## డబ్బింగ్‌లకే పరిమితమా?: శిల్ప



బుల్లితెర మీద సూపర్ హీరోయిగా ఓ వెలుగు వెలిగిన శిల్పది మంచి వాయిస్సే కాదు. చక్కని నటన కూడా అందించగల టాలెంట్ ఆమె స్వంతం. చిత్రపరిశ్రమ శిల్పను డబ్బింగ్ ఆర్టిస్టుగానే గుర్తించింది. నటిగా వెండితెర మీద ప్రోత్సాహకరమైన అవకాశాలు రావడం లేదు. సౌందర్య, రంభ లాంటి హీరోయిన్లకు డబ్బింగ్ చెప్పేది శిల్పే! అన్నట్టు ఈ మధ్య శిల్ప, శ్రీమతి శిల్ప అయినట్టు వార్త!

-సాకేత్

భుజానున్న సద్దులు విప్పినారు అప్పటికే ఆ పక్కన తిని కూర్చున్న కోయలిద్దరు కనపడినారట.

'ఏ వూరు? ఏడనుంచి వస్తున్నారు?' అడిగినారట మనోళ్ళు.

'పట్నం!'

'ఎందుకు?'

'రాతబాగాలేక.'

'అదేంకత.'

అడిగినోడికి చెపితేనన్న సగంబరువు తీరతరను కున్నరో ఏమో? చెప్పినారట.

'నా పేరు సవరయ్య. 'ఈరు' అడవి నున్న పెద్ద గుంపు మాది. ఏడుగంటలకల్లా లెనక కొందరు అడిలోనికొచ్చారు. ఇది స్వరాజ్యం - అంటే మన రాజ్యం అని చెప్పినారు. సంఘాల్లో చేరకు అని చెప్పి మనగాంధీ గారు, అడివినున్నోళ్ళకు అనేకం - మంచిపనులు చేసేటందుకు పథకాలను పెట్టినారు.

గద్దిలెక్కేవాళ్ళకు కోటాలిచ్చినారు. గందుచేత - కూడు గుడ్డలకు దొరల లెక్కన బతకొచ్చు.' అని చెప్పి- కొందరు తెల్లచొక్కలోళ్ళను చూపి 'ఇగో వీళ్ళు మీకు సగం ధరకి బర్లను, గొర్లెను ఇచ్చేటందుకు వచ్చినారు!' అని చెప్పితిరి. "సర్లే! మనోళ్ళుగదా' అని- సరేనంటిమి. బర్లు - గొర్లు రాగానే- పాలకేంద్రం పెట్టినారు. అడ పాలుపోస్తే- పైకం జమయితదంటిరి. బాకీ తీరిపోతదంటిరి. అట్లనే- అందరం పోస్తిమి. మనోళ్ళుగనక ఇంత సదుపాయం జేసినారని సంబరపడ్డం!

ఇప్పుడేమో 'ఆ బాకీ అట్లనే ఉన్నది! వడ్డీ అనలంత యింది కట్టకపోతే. దున్నేపోడును- ఆపుతం. ఎండ పెడ తం' అంటున్నారు. మరి మేం కేంద్రానికి పోసిన పాలేమి అయినట్టు? మమ్మల్ని కంచర్లని చేసేటట్టుంది మనోళ్ళు! బాబులూ! మాకిక అప్పులొద్దు. మాఫీలొద్దు కోటాలొద్దు. మమ్మల్ని ఇకముందు ఈ తెల్ల చొక్కాలోళ్ళకు - పావుల్ని చేయొద్దు మా బతుకు మమ్మల్ని బతకనివ్వండి. మా అప్పులెప్పుడో జమ చేసినం అడవిలోకి రాకండి అని మొక్కేసినం' చెప్పింది విన్నారు. నోరు మెదపలేదు. కలంతో ఏదో రాసుకు న్నారు. పోలీసులొచ్చి మమ్మల్ని 'ఠానా'లోకి నెట్టినారు.

రెండునెలలు దిరిగినంక వదిలినారు. ఈ మద్దెన 'పాలు పోసిన డబ్బు కేంద్రంనుంచి తీసుకున్నరు గదా! తీసుకున్నమని చెప్పండి' అని పోలీసు ఠానాలో- లాఠీలతో విరగబాదుతూ పాఠం చెప్పినారు.

ఇక ఇప్పుడేమో- ఇట్టాతిప్పుతున్నారు. ఈ తిప్పులాటకే, ఇంటిముందున్న సగం జీవాలు అమ్ముడు పోయినై. చేసుకునే పని చెడింది. నిక్షేపంగ ఉన్న బతుకు చెడింది. అని కళ్ళ నుండి జారుతున్న కన్నీటిని, గోచి పాతతో అద్దుకున్నడు.

మనోళ్ళకిది సమజయినాక గుండెలనిండా గుబుల యింది.

తినేటందుకు విప్పిన చద్దిని- కుక్కముందుంచి- మనాదిగా లేచినారు.

పొరికిచ్చిన ఊరికి జేరటప్పటికి నడి ఝూమాయె. పొద్దుటే, ఊరిమీదపడి నల్లుర్ని పోగుజేసి- సంగతి జెప్పి నిగ్గదోసినారు.

'అయితే! వాడు చింతాకంత బెదరలేదట. పైగా బేఫికరగవచ్చి- మనోళ్ళతోనకూర్చుని- లోకం తరీఖతెలిసే వచ్చినరా! 'గా' రమణయ్యను చూడిర్రి. వాని ఇంటిది నౌకరి చేయటంలేదా? లోకంగనక అదో ఇదో అన్నా- నమ్మక నడుపక రావడంలే! ఆడికే ఎప్పుడో ఒక్కప్పుడు ఇంటిదాని అక్కరా ఉంటదిగదా!" ఆ పాపం అటూ మొదటి వరువు- పరువు ఇజ్జతో అని మొదట గింజుకున్నడు' సంగతి ఆసాంతం తెల్పినంక ఊకున్నడు.

బోలెడు ఆదావస్తుండే! ఎవరేంచేసినా మంచిగ బతి కేందుకేగదా! ఎవరి బతుకునుబట్టి వాళ్ళు చేసుకొనకపోతే తప్పున పడిపోతారు. అని నచ్చచెప్పి పంపిండు. మంచిగ మర్యాద చేసిండు. తిరుగు మొఖం పట్టినంక- ఇగో! పోరికి కాస్త గట్టిగ నచ్చచెప్పి తోలుండ్రి.' అన్నడు సాగనం పెటందుకు వచ్చి.

వీడు మాటాడేదాంట్ల చింతాకంత నాయం ఉందా?

ఎంత కుటుంబం కోసమైనా అన్యాయమవుతారా! అనుకుంటూ అర్థమవకున్నా, తోవనపడాల్సి వచ్చింది.

★ ★ ★

సామాజికపరమైన మంచి వెనకబడి, ఆర్థికపరమైన న్యాయం బలంగ చుట్టుముట్టుతోన్న ఈ దినాలలో - ఏది న్యాయం? అన్న ప్రశ్న మనం వేసుకోవాలా? అవసరమా?

మరి. ఇంతకాలంగా సమాజాన్ని చెడకుండా నడుపుకొచ్చిన కుటుంబ వ్యవస్థ చెడితే? అమ్మో!

★ ★ ★

తెల్లరాజ్యంబోయి నల్లరాజ్యమొచ్చె

'రాత మారని జనమూ...


డప్పు చిందుల ఎనకనుంచి - సన్నగా పాటవిని పిస్తాంది. ★


చావా శివకోటి

గోకినపల్లి (పోస్టు),

ముదిగొండ మండలం,

ఖమ్మం జిల్లా.


వి. బావాజి, కార్టూనిస్ట్, కురబాలకోట-517350, జిల్లా:చిత్తూరు.